స్పందించకుంటే ముప్పే!



పాతగాజువాక 60 అడుగుల రోడ్‌లో నిలిపిన ప్రైవేట్ ట్రావెల్ బస్సులు

గాజువాక నియోజకవర్గం పరిధిలో భారీ వాహనాల రాకపోకలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఇరుకు వీధుల్లో సైతం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో జనం ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలు రాకపోకలు సాగించాల్సిన రోడ్లపై భారీ లారీలు, ట్యాంకర్లను రోజుల తరబడి నిలిపి ఉంచుతుండడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు సరదాగా రోడ్లపైకి రావాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యపై ఫిర్యాదులు అందుతున్నా సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం ఆరోపణలకు తావిస్తోంది.

- గాజువాక



అగనంపూడి వద్ద ట్రాఫిక్

పార్కింగ్‌కు అడ్డా..

పలు ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు, పీహెచ్‌సీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలున్న చినగంట్యాడ వందడుగుల రోడ్డు పూర్తిగా లారీలు, ట్యాంకర్లు, ట్రాలర్ల పార్కింగుతో నిండిపోతోంది. ఉదయం, సాయంత్రం ఆ రోడ్డులో వెళ్లాలంటే ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనన్న ఆందోళనతో జనం భయపడాల్సి వస్తోంది. ఈ రోడ్డులో ఉన్న చినగంట్యాడ శ్మశానం, గాజువాక పీహెచ్‌సీ, గాజువాక తహసీల్దార్ కార్యాలయాలను ఆనుకొని వాహనాలు నిలిపివేస్తున్నారు. అనధికార పార్కింగ్‌లను అనుమతించేది లేదని ట్రాఫిక్ సిబ్బంది చెబుతున్నా.. వాటిపై చర్యలు తీసుకోకపోవడంతో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నివాస ప్రాంతాల్లోనూ అదే తీరు

నివాస ప్రాంతాల్లోనూ భారీ వాహనాలను వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ఆటోనగర్‌కు ఆనుకొని ఉన్న విశ్వేశ్వరయ్య ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద లారీలు, ట్యాంకర్లను, ట్రాలర్లను నిలిపివేస్తున్నారు. వాటిల్లో ప్రమాదకరమైన యాసిడ్ ట్యాంకర్లు కూడా ఉంటున్నాయి.

జాతీయ రహదారికి చేరుకోవాలన్నా అవస్థలే...

వంతులుగారి మేడవద్ద ప్రధాన రహదారిలో కూడా పలు ట్రాన్స్‌పోర్టులకు చెందిన లారీలు, ట్యాంకర్లను నిలిపివేస్తుండటంతో నివాసితులు ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాలను వరుసగా ఆపేస్తుండడంతో ఆ ప్రాంతం నుంచి జాతీయ రహదారిపైకి ఆటో వెళ్లి రావాలన్నా అవస్థలు తప్పడం లేదు.

కానరాని ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు

వీధుల్లో సైతం భారీ వాహనాల రయ్‌రయ్

అనధికార పార్కింగ్‌తో అవస్థలు

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృతి

అగనంపూడి నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారి నిత్యం భారీ వాహనాలతో నిండిపోతోంది. నిర్దిష్ట సమయమంటూ లేకుండా నగరంలోకి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా ప్రమాదాలు కూడా పెరుగుతున్న విషయం తెలిసిందే. గాజువాక పట్టణ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల కారణంగా 20 మంది మృతి చెందినట్టు లెక్కలు చెబుతున్నాయి. విశాఖ నగరం నుంచి ఫార్మాసిటీ, బ్రాండిక్స్ తదితర కంపెనీలకు సుమారు 220 ట్రావెల్ బస్సులు తిరుగుతున్నాయి.

వీటికి భారీ వాహనాలు తోడవడంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్న వేలాది మంది పిల్లలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీంతో అగనంపూడి నుంచి షీలానగర్ వరకు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు.

ప్రతిరోజూ ట్రాఫిక్ జామ్

భారీ వాహనాలతోపాటు వివిధ కంపెనీలకు తమ ఉద్యోగులను తీసుకెళ్లడం కోసం ట్రావెల్ బస్సులు సైతం వీధి రోడ్లలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. అదే సమయంలో పాఠశాలలకు చెందిన ఆటోలు, బస్సులు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కారణంగా ప్రతిరోజు ట్రాఫిక్ జామ్ సమస్యగా మారింది. భారీ వాహనాల పార్కింగ్‌తో హైవేతో పాటు కాలనీల్లో రోడ్లు కూడా పార్కింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. కొన్ని నిర్దిష్టమైన సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కింగ్‌కు అనుమతించిన ప్రాంతాలివే..

గాజువాకలోని జాతీయ రహదారిపై శ్రీనగర్, నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్లలో భారీ వాహనాలు నిలపడానికి పోలీసులు అనుమతి ఇచ్చారు. అయితే వాటినితోపాటు కాలనీల్లోని ప్రధాన రహదారులు, వీధుల్లో రోడ్లపై కూడా లారీలు నిలపడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

వడ్లపూడి రోడ్‌లో భారీ వాహనాల హల్‌చల్

వడ్లపూడి నిర్వాసిత కాలనీ ప్రధాన రహదారిలో భారీ వాహనాలు నిత్యం హడావుడి చేస్తున్నాయి. కాలనీ ఆటోనగర్‌కు ఆనుకొని ఉండడంతో జాతీయ రహదారిపై వచ్చే భారీ లారీలు, ట్రాలర్లు ఈ రోడ్‌లో ఆటోనగర్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. వాస్తవానికి వివిధ ప్రాంతాల నుంచి ఆటోనగర్‌కు రాకపోకలు సాగించే భారీ వాహనాలు శ్రీనగర్ జంక్షన్ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అయితే, దూరం తగ్గుతుందన్న కారణంతో డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వడ్లపూడి ట్రాఫిక్ సిగ్నల్‌వద్ద ట్రాఫిక్ సిబ్బంది ఉంటున్నప్పటికీ కాలనీ లోపల నుంచి వెళ్లే భారీ వాహనాలను మాత్రం పట్టించుకోవడంలేదు. డ్రైవర్ల వద్ద మామూళ్లు తీసుకొని వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



చినగంట్యాడ వందడుగుల రోడ్‌లో భారీ వాహనాలు

ఇదీ సూచన

లంకెలపాలెం నుంచి షీలానగర్ వరకు జాతీయ రహదారిపై భారీ వాహనాలను అనుమతించే విషయంలో సమయాలను నిర్ణయించాలని జనం కోరుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భారీ వాహనాలను నిలుపుదల చేయాలని, సిటీ ట్రావెల్స్ ఎక్కడబడితే అక్కడ ఆపకుండా వాటిని నిలుపుదల చేయడానికి కొన్ని ప్రత్యేక స్టాపులను ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. ఈ విషయంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని సూచిస్తున్నారు. కాగా, నివాస ప్రాంతాల్లో ఉన్న రహదారులపై భారీ వాహనాలను నిలువరించాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సమష్టి కృషి

గాజువాకలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కేవలం పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో సాధ్యం కాదు. జీవీఎంసీతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధుల సహకారం కూడా కావాలి. దీనిపై ఇప్పటికే వివిధ కంపెనీల ప్రతినిధులతో, ప్రభుత్వ విభాగాల అధికారులతో మాట్లాడాం. మా ప్రతిపాదనలను రాతపూర్వకంగా అందజేశాం. నిబంధనలను అతిక్రమిస్తున్నవారిపై ఈ చలానాలను ఇంపోజ్ చేస్తున్నాం. రోడ్లపై షాపులను వెనక్కి జరిపిస్తున్నాం. పీక్ సమయాల్లో లారీలు రాకుండా చర్యలు చేపట్టాలని ఆటోనగర్ కమిషనర్‌కు కూడా రాతపూర్వకంగా చెప్పాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– కోటేశ్వరరావు, గాజువాక ట్రాఫిక్ సీఐ

క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి



రోడ్డు ప్రమాదంలో గాయపడిన సునీల్‌ను పరామర్శిస్తున్న దేవన్‌రెడ్డి

కూర్మన్నపాలెం: కార్యకర్తలకు కష్టం వస్తే ఆదుకోవడానికి తాను ముందు ఉంటానని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి అభయమిచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన 86 వార్డు సీనియర్ నాయకుడు సాగి సునీల్‌ను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మట్లాడుతూ కార్యకర్తలకు కష్టం వస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సునీల్ కుటుంబసభ్యులకు దేవన్‌రెడ్డి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వార్డు నాయకులు దుర్గపు దానప్పలు, ఎం. మురళీమోహన్, నెల్లూరు శ్రీను, కింతలి బాబురావు, సుబ్బయ్య, అప్పారావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

25న ఓబీసీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 25న నిర్వహించనున్నారు. స్టీల్‌క్లబ్‌లో ఆ రోజు సాయంత్రం 6 గంటలకు నిరన్వహించనున్న 4వ సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాలపై చర్చించనున్నారు. సమావేశానికి ఓబీసీ ఉద్యోగులంతా హాజరై అసోసియేషన్ అభివృద్ధికి తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని అసోసియేషన్ అధ్యక్షుడు బి. అప్పారావు కోరారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

అక్కిరెడ్డిపాలెం: ప్రభుత్వాలు అందజేస్తున్న ప్రోత్సాహకాలను ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలు అందిపుచ్చుకోవాలని ఆటోనగర్ రత్న ఇంజినీరింగ్ కనస్ట్రక్షన్ అధినేత ఈడుపుగంటి అనార్‌బాబు అన్నారు. ఆటోనగర్ ఎఫ్ – బ్లాక్‌లోని రత్న ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ పరిశ్రమలో శుక్రవారం ఎంఎస్‌ఎంఈ నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ స్పెషల్ డ్రైవ్ కమ్ పోర్టల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ హబ్ ప్రతినిధి బి.శ్రీకాంత్, ఎంఎస్‌ఎంఈ ఏడీ ఎస్.ఎల్.ఎన్.ప్రసాద్‌లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేశారు.

నర్సింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: శ్రీకాకుళంలోని జెమ్స్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మూడు, పోస్టు బేసిక్ నర్సింగ్‌లో కొన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్‌కు ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులై ఉండాలని, పోస్టు బేసిక్ నర్సింగ్‌కు జీఎన్ఎం (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ) ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులను ఉచితంగా చదివించడంతో పాటు కోర్సు పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశం కల్పించి వారికి ఇచ్చే జీతంలో ఫీజులు మినహాయించనున్నట్టు తెలపారు. వివరాలకు బొల్లినేని మిడ్‌స్కిల్స్, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి క్యాంపస్, 7995013421, 7207953919 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు కణితి విద్యార్థి



నమ్మి నితీష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం సూర్యప్రకాశరావు

కూర్మన్నపాలెం: జాతీయ స్థాయి జూనియర్ నెట్ బాల్ పోటీలకు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నమ్మి నితీష్ ఎంపికయ్యాడు. ఈ నెల 23, 24 తేదీల్లో హరియాణలో నిర్వహించనున్న పోటీలకు హాజరు కానున్నాడు. తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో జాతీయ స్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని ఎంపిక చేశారని ప్రధానోపాధ్యాయుడు బి.సూర్య ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం విద్యార్థినితీష్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మన్నాజీని కూడా అభినందించారు.

మైనార్టీసెల్ అధ్యక్షుడికి అభినందన



నసీర్‌ను అభినందిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన మహ్మద్ నసీర్ అహ్మద్‌ను ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అభినందించారు. నసీర్ ముస్లిం నాయకులతో వెళ్లి శుక్రవారం దేవన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.ఎం.డి.గౌస్, 66వ వార్డు నాయకులు పెద్దిరెడ్డి ఈశ్వరరావు, సర్దార్ మోతి, మదీనావలి, బాషా, రఫీ, రైస్ మదీనా, వలి, అలీ, తస్లీమా, ఉమర్, హుస్సేన్, రబ్బాని, కాసిం, జియా వారిస్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న అప్పారావు

అగనంపూడి: పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు జి.అప్పారావు డిమాండ్ చేశారు. 85వ వార్డు పెదమడకలో శుక్రవారం పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆప్కాస్ రద్దు చేయాలని, ప్రైవేటు ఏజెన్సీలు వద్దే వద్దని, కార్మికులను వెంటనే పెర్మినెంట్ చేయాలని, కార్మికుల వేతనాల నుంచి ఆదాయ పన్నుకోసం మినహాయించిన సొమ్ములను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెలా కొంతమంది కార్మికులకు జీతాలు వేయకుండా వేధిస్తున్నారని,దీనిపై విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రాజు, సత్యవతి, కనకరరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దేశభక్తి గీతాలాపన

పాల్గొన్న 3వేల మంది విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ తదితరులు

గాజువాక: చిన్మయ మిషన్, సర్దార్ ప్రాజెక్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేశభక్తి గీతాల ఆలాపన ఉత్సాహంగా సాగింది. స్థానిక సర్దార్ నెస్ట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన చిన్మయ యువతరంగ్ కార్యక్రమంలో భాగంగా మూడు వేల మంది విద్యార్థులు ఒకేసారి దేశభక్తి గీతాలతో పాటు భగవద్గీత పారాయణ చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ దేశభక్తి, దైవ భక్తితో పెరిగే పిల్లలు సమాజానికి చేయూతనందిస్తారన్నారు.బాల్యం నుంచే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గౌతు శిరీష ,చిన్మయ మిషన్ ప్రతినిధి స్వామి రఘునంద, ఏసీపీ త్రినాథ్, సర్దార్ ప్రాజెక్ట్స్ ఎండీ యార్లగడ్డ వెంకన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులతో హెచ్‌ఎం కాంతం, తెలుగు ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: మాతృభాషా దినోత్సవాన్ని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో తెనాలి రామకృష్ణుడు, వేమన శతకాలు, నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్. కాంతం మాట్లాడుతూ తెలుగు భాష తల్లిలాంటిదని, ఏదేశంలో ఉన్నా తెలుగు భాషను గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు గండికోట కృష్ణవేణి, వారణాసి రాఘవ శ్రీనివాస్, పీడీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అగనంపూడి: భాషోత్సవం ముగింపు సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషోత్సవాలు వారం రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, వక్తృత్వ, కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విజ్ఞానానికి మూలం భాష అన్నారు. మాతృభాషతోపాటు మరో రెండు భాషలను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

25న స్టీల్‌ప్లాంట్ స్టేషన్‌లో వాహనాల వేలం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలను ఈ నెల 25న వేలం వేయనున్నారు. స్టేషన్ పరిధిలో విడిచిపెట్టిన 25 వాహనాలకు సంబంధించి వాటి యాజమానులు, సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీలు ఏ విధమైన క్లెయిమ్ చేయకపోవడంతో అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఐ కేశవరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలంలో ఔత్సాహికులు వేలంలో పాడుకుని డబ్బులు చెల్లిస్తే ద్విచక్ర వాహనాలు అప్పగిస్తామని పేర్కొన్నారు.

పోస్టుమన్ అదృశ్యం



బలగ మహేష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది పోస్టాఫీసులో పోసుమన్‌గా పనిచేస్తున్న బలగ మహేష్ (21) ఈ నెల 14వ తేదీ నుంచి కనిపించడం లేదని గాజువాక పోలీసులు శుక్రవారం తెలిపారు. మహేష్ స్వస్థలం పార్వతీపురం జిల్లా చినగుడబ అని, మిందిలో రూం తీసుకుని నివాసం ఉంటున్నాడని పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే గాజువాక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

టిడ్కో గృహాల పరిశీలన



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న అధికారులు

పెదగంట్యాడ: టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని టిడ్కో ప్రాజెక్ట్ అధికారులు హామీ ఇచ్చారు. మండలంలోని టిడ్కో గృహ సముదాయాలను శుక్రవారం టిడ్కో ప్రాజెక్ట్ ఈఈ సుధాకర్, ఏడీఈ రాజేష్ చంద్ర, ఎలక్ట్రికల్ ఏఈ, టాటా ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు టిడ్కో గృహాల్లో ఉంటున్న నివాసితులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్, కాలువలు వంటి సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సహాయం అందజేత



సాయి మహర్షి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న పట్టా రామప్పారావు బృందం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన తలారి సాయి మహర్షి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో పలువురు దాతలు ఆపన్నహస్తం అందజేస్తున్నారు. అగనంపూడి కొండయ్యవలసకు చెందిన ఆర్‌టీఐ ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు సాయి మహర్షి కుంటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. రెండో విడతగా సేకరించిన రూ.50 వేల నగదును శుక్రవారం పట్టా రామ అప్పారావు బృందం సాయిమహర్షి తండ్రి తలారి శంకర్రావుకు అందజేశారు. ఇప్పటి వరకు రూ.76 వేలు అందజేసినట్లు విద్యార్థి తండ్రి శంకర్రావుకు తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా ముందుకు..



పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

అగనంపూడి: పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ సమష్టిగా పని చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పార్టీ జిల్లా కమిటీలో, గాజువాక నియోజకవర్గ కమిటీలో స్థానం దక్కించుకున్న పలువురు నాయకులు శుక్రవారం అమర్‌నాథ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవార్ని పార్టీ ఎప్పటికీ మర్చిపోదన్నారు. అమర్‌నాథ్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బలిరెడ్డి నాగేశ్వరరావు, గాజువాక నియోజకవర్గ వలంటీర్ల విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీను, ప్రచార విభాగం అధ్యక్షుడు గుర్రం శ్రీను, నాయకులు గొలగాని శ్రీను, కొశిరెడ్డి రమణారావు తదితరులు ఉన్నారు.

ఎస్సీసెల్ అధ్యక్షుడు పరదేశికి సత్కారం



ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరదేశిని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన మార్పుపూడి పరదేశిను శుక్రవారం స్టీల్ వైఎస్సార్ టీయూసీ నాయకులు సత్కరించారు. సెంట్రల్ స్టోర్స్ సమీపంలోని యూనియన్ పాయింట్ వద్ద పరదేశికిశాలువా కప్పి బొకే అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తున్న పరదేశికి పదవి అప్పగించడం అభినందనీయమన్నారు. పరదేశి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గుడివాడ అమరనాథ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంపంగి ఈశ్వరరావు, గొందేశి వెంకటరమణ, గొందేశి అప్పలరెడ్డి, పిట్టారెడ్డి, వాసా అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్‌పై అసత్య ప్రచారం తగదు

ఉక్కునగరం: ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలని స్టీల్‌ప్లాంట్ అధ్యక్షుడు బొండా తాడన్న అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొంత మంది సభ్యులు చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో యూనియన్లతో సమానంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంతో పాటు రివైవల్ ప్యాకేజీ రావడంలో కీలక పాత్ర పోషించామన్నారు.

పవర్ లిఫ్టర్‌కు అభినందన



పవర్ లిఫ్టర్ రమేష్‌ను అభినందిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన రాపాక రమేష్ యాదవ్‌ను శుక్రవారం వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అభినందించారు. ఇటీవల నిర్వహించిన మూడు అంతర్జాతీయ పోటీల్లో రమేష్ సత్తా చాటాడు. నెల్లిముక్కుకు చెందిన రమేష్ యాదవ్ శుక్రవారం దేవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో బొడ్డ గోవింద్, ధర్మాల శ్రీను, రోజారాణి, స్వాతి పాల్గొన్నారు.